# బంధం

యద్దనపూడి సావిత్రి

''మామ్మగారూ!'' అంటూ వచ్చింది సులోచన.

జానకమ్మ సంచీ సర్దుకుంటున్నదల్లా వెనక్కి తిరిగింది. రెండేళ్ల కొడుకు పూర్ణని చంకన వేసుకుని గుమ్మంలో నిలబడ్డది సులోచన. ఆమె భుజానికి వేసుకున్న చిన్న తోలు సంచీలోంచి పూర్ణ బట్టలు బయటకు తొంగి చూస్తున్నాయి. చిరిగిన ఆ సంచీకి ఎన్నో అతుకులేసి కుట్టుకుని అందులో పూర్ణవి ఓ జత బట్టలూ, చిన్న అల్యూమినియమ్ టిఫెన్లో అన్నం పెట్టుకు వస్తుంది సులోచన. పొద్దునే తొమ్మిదయిందంటే గుమ్మం దగ్గర నిలబడి వుంటుంది.

'పాపం ఈవేళ దానికేం పని వుంది?' అనుకున్న జానకమ్మ ''ఈవేళ నేను మా అబ్బాయి దగ్గరికెళతానే అమ్మాయి. అంచేత రేపురా'' అంది.

సులోచన, జానకమ్మవైపు ఒక్షణం పరీక్షగా చూసింది. ఆ చూపు జానకమ్మకి ఇబ్బందిగా అనిపించింది.

''ఏమిటి అలా చూస్తున్నావు? ఇవాళ నా మనవడి పుట్టినరోజు. అంచేత కాస్త వెళ్లొద్దామని అప్పడాల పిండి కూడా పట్టించలేదే'' అంది జానకమ్మ అప్పడాలు చేసే పని లేదన్నట్లు తేల్చేస్తూ. సులోచన తల వూపి వెనుదిరిగింది.

జానకమ్మ ఆ వీధిలో అద్దెకువచ్చి పదేళ్ళు దాటింది. కొడుకు ఏనాడూ అక్కడికి రాలేదని సులోచనకే కాదు వీధికందరికీ తెలుసు. అంచేత జానకమ్మగారి కోడల్నీ, మనవల్ని చూసినవాళ్ళు ఎవరూ లేరు.

**ఆరేళ్ళ గోపాలం ప్రక్కింటి పిల్లల్తో పోటీగా కొత్త బట్టలు కావాలంటే ఓ పెళ్లికి వంటకెళ్లింది. ఆ డబ్బులతో కొత్త బట్టలు కొంది కొడుక్కి. పన్నెండేళ్ళ గోపాలం స్కూలు పిల్లల్తో నాగార్జునసాగర్ వెళతానంటే యాభైరూపాయలు లేక నీళ్ళు కాచుకునే రాగి తప్పేలా అమ్మిన రోజు గుర్తొచ్చింది.**

అప్పుడప్పుడూ జానకమ్మ ఏవో కబుర్లలో వాళ్ళ మాట చెబుతుంది. కాస్త అక్షరజ్ఞానం వున్న సులోచనతో నెలకో, రెండు నెలలకో ఓ ఉత్తరం రాయిస్తుంది కొడుకు పేర. వచ్చే సమాధానాలు సులోచనే చదివి వినిపించాలి. సమాధానాలు చదువుకోవడం కూడా రాని జానకమ్మకి సులోచన చదివే జవాబులు స్వాతి జల్లుల్లా ఉంటాయి అందులో ఏం వుంటుందో తెలీదు కనుక.

జానకమ్మ సంచీలో అన్నీ పెట్టుకున్నానా లేదా అని అనుమానం వచ్చి చూసుకుంది. ఏదో మరచిపోయినట్లుగా అనుమానం. మళ్లీ అన్నీ తీసి బయటపెట్టింది. అరిసెల డబ్బా పెట్టుకోలేదు. గూట్లోని ఓ డబ్బా తీసి చూసింది. అందులో ఓ గుప్పెడు అటుకులు వున్నాయి. అవి చిన్న ప్లాస్టిక్ కవర్లో పోసి గూట్లో పెట్టింది. ఆ డబ్బాలో ముందటి రోజు చేసిన అరిసెలు పెట్టింది. ఆ డబ్బా సంచీలోకి దింపి పైన కారప్పూస డబ్బా పెట్టింది. మళ్లీ ఏదో గుర్తొచ్చింది. తన ట్రంకు పెట్టె తీసి అందులో పైనున్న ఓ చిన్న డ్రెస్ తీసింది. 'ఫర్లేదు సరిపోతుంది. ఇంకా వాడికి మూడేళ్ళేగా!' అనుకుని ఆ డ్రెస్సు సంచీలో పెట్టింది. పెట్టె అడుగున చిల్లర తీసుకుని లెక్క పెట్టింది. సరిగ్గా ఇరవై రూపాయలున్నాయి.

ఒక్కసారిగా ఆవిడ మొహం దిగులుతో నిండింది. నిన్న అప్పడాల కోసం మినపప్పు తెప్పించక బియ్యం తెచ్చి పిండి కొట్టించింది అరిసెల కోసం. ప్రక్కింట్లో అద్దెకున్న కుర్రాడు రాజీవ్ అప్పడాలు కొనుక్కుని పది రూపాయలిస్తే సెనగపిండి తెచ్చి జంతికలు చేసింది. 'ఈ ఇరవైకి మరో పది ఎవర్నయినా అడిగి రేపటి రోజుకి అప్పడాల పిండికై మినపప్పు తెప్పించాలి? మరి వెళ్ళేందుకెలా? వెళ్తూ వెళ్తూ పసివాడికి బిస్కెట్లు తీసుకెళ్లద్దూ?' అని మళ్ళీ ఆలోచించింది. ఆవిడ మనసు రేపటి అవసరంకంటే మనవడి బిస్కెట్లవైపే మొగ్గు చూపింది.

చిల్లర మహా అయితే ఇంకో నాలుగు రూపాయలుంటాయి పెట్టె అడుగున. బస్సుకెంతవుతుందో? అయ్యో! సులోచన్ని అడగాల్సింది అనుకుంది. అలా అనుకుంటూనే ఇంటికి తాళంవేసి బస్టాప్ వైపు నడిచింది.

ఓ అరగంట తరువాత 3వ నెంబర్ బస్సులోంచి తార్నాకా దగ్గర దిగింది ఆవిడ. 'ఇట్నుంచి ఎటెళ్లాలో ఏమిటో?' ఆవిడ కంటికి ఎదురుగా ఓ అమ్మాయి పుస్తకాల్తో కనిపించింది. బస్సుకోసం నిలబడ్డదేమో!

''అమ్మడూ! విజయపురికాలనీ అంటే ఎక్కడ తల్లీ?'' అంటూ అడిగింది.

పాపం ఆవిడ్ని చూసి జాలేసిన ఆ అమ్మాయి ''ఎడంచేతివైపు తిరిగి తిన్నగా వెళ్లండి. అక్కడ రైల్వే డిగ్రీ కాలేజీ వుంటుంది. దాని ఎదురుగా సందులో తిన్నగా వెళ్లాలి'' అంటూ ఎలా వెళ్లాలో చెప్పింది. ''అయినా అంత ఎండలో బయల్దేరారు. దూరం నడవలేరు. పోనీ ఆటోలో వెళ్లండి'' అంది మళ్ళీ.

''ఎండాకాలం ఎండ మరి...మండిపోదూ? అయినా పన్నెండయితే తిరగడం కష్టంగానీ ఇప్పుడు పర్లేదు. నాలుగడుగులు వేసి ఆటో ఎదురుపడితే ఎక్కుతాలే'' అంటూ బలహీనమైన చేతుల్ని పరీక్షించే సంచీని పట్టుకుని నడుస్తూ ఓ చేతిలోంచి ఓ చేతిలోకి సంచీని మార్చుకుంటూ ముందుకు సాగిందావిడ. పాత చీర ఆవిడ లేమిని చెప్పకనే చెప్పింది ఆ అమ్మాయికి.

కాస్త దూరం వెళ్లాక ఆవిడకి ఇక నడవలేను అనిపించింది. నాలుగు రూపాయలు టిక్కెట్టుకుపోతే పదహారు రూపాయలున్నాయి. ఇంకా మనవడికి బిస్కెట్టు పాకెట్టు కొనాలి.

ఆవిడ గబగబా నడవడానికి ప్రయత్నించింది. డిగ్రీ కాలేజీదాకా రాగానే ఎటు వెళ్లాలో ఇంకొర్ని అడిగి తెలుసుకుని ముందుకు దారి తీసింది. బాప్టిస్ట్ చర్చి దాటి ఇంకా ముందుకు డౌన్లోకి వెళ్లింది. అక్కడున్న ఓ కొట్లో ఇంటి నెంబరు రాసున్న అడ్రస్ చూపించి ఎక్కడో కనుక్కుంది. ఇంకా ముందుకెళ్లాలి. హఠాత్తుగా ఆవిడకి బిస్కెట్ల పాకెట్ గుర్తొచ్చింది. క్షణం ఆగి ''అయ్యో!'' అనుకుంది. 'పోనీ పదిరూపాయలు చేతిలో పెట్టేదా?' అనుకుంది. అలా అనుకుంటూ ఇంకో వంద గజాలు వెళ్లి గులాబీరంగు బిల్డింగ్ ముందు ఆగింది. అదే ఇల్లు. ఆ

కొట్టాయిన చెప్పినట్లే ఉంది.

గేటును తోసుకునేందుకు ఆ చేతుల్లో ఎంత శక్తి వచ్చిందో అంతే ఉత్సాహం శరీరంలోనూ వచ్చింది. లోపలికెళ్లగానే గేటు చప్పుడు విని ముందు గది లోంచి ఓ మధ్యవయస్కురాలు వచ్చింది.

''ఎవరు నీవు? ఏం కావాలి? బయటుండి పిలువ లేవూ?'' ఆవిడ ప్రశ్నకంటే ఆ ప్రశ్నించే విధానంలోని సంస్కారం జానకమ్మను బాధించింది. అరవై ఏళ్ళ పైబడ్డదాన్ని 'మీరు' అనైనా అనలేదు.

''గోపాలం ఉంటాడు కదూ! ఇక్కడేనా?'' అని అడిగింది జానకమ్మ.

''లేదు!''

''అదేమిటీ ఇదే అడ్రసయితేనూ?'' అంటూ అడ్రస్ కాగితం ఆమెకి చూపించింది.

ఆ కాగితం అందుకుని చూసి ''రెండునెలల క్రితం వాళ్ళు ఖాళీచేసి రైల్వే క్వార్టర్స్‌లోకి వెళ్లారు'' అని చెప్పి లోపలకు వెళ్ళబోయిందావిడ.

జానకమ్మకి నెత్తిన పిడుగు పడ్డట్టయింది. తనకెలా తెలుస్తుంది ఇల్లు?


''అమ్మా! ఎక్కడి క్వార్టర్సో చెబుతారా? నేను తప్పకుండా వెళ్లాలి'' అని ప్రాధేయపడుతున్నట్లుగా అడిగింది జానకమ్మ.


''రోడ్డుపైన రైల్వే ఆఫీసర్స్ క్లబ్ ఉంది. దానికెదురుగా రోడ్డులోపల అనుకుంటా'' అని ఆమె లోపల కెళ్లి తలుపు వేసుకుంది.

జానకమ్మ ఒళ్ళంతా చెమటతో తడిసి వుంది. నాలుక పిడచగట్టుకుపోతోంది. తలుపేసుకున్న ఆవిడ్ని ఇహ మంచినీళ్ళేం అడగను? అనుకుంటూ వెనక్కి తిరిగింది.

కాళ్లల్లో బలం కూడదీసుకుని మెల్లగా రోడ్డుపైకి వచ్చింది. కళ్ళు తిరుగుతున్నాయి. హోటల్ దగ్గర నిలబడి మేనేజర్ని కాస్త మంచినీళ్ళు ఇప్పించమని అడిగింది. అతడు సర్వర్ని పిలిచి మంచినీళ్ళు తెమ్మన్నాడు.

ఆ నీళ్ళు తాగి బయల్దేరబోతుంటే ఆ





## అతి పెద్దదయిన మ్యూజియం

తైవాన్‌లోని టామ్‌చాంగ్ అనే మ్యూజియం ఆసియా ఖండంలో అతి పెద్దదైన తొలి గిన్నీస్ మ్యూజియంగా ప్రసిద్ధి చెందింది. 1,148 చదరపు మీటర్ల దీని విస్తీర్ణం. ప్రపంచంలోనే అతి పొడవైన వ్యక్తిగా గుర్తింపబడిన రాబర్ట్‌వాడ్లో (272 సెం.మీ), ప్రపంచంలో అతి పొట్టి స్త్రీ పాలిన్ మస్టర్స్ (61 సెం.మీ)ల ఫొటోలు, ఇంకా 30.48 మీటర్లున్న కారు, 1.98 సెం.మీ వ్యాసార్థంగల అతి బుల్లి సైకిల్ వంటివి ఈ మ్యూజియంలో ఉన్నాయిట. మరి మీకు కూడా చూడాలని ఉత్సాహంగా వుందా? గో అండ్ ఎంజాయ్!


## కొత్తరకం ఫోన్లు

చైనాలోని ఫోన్‌లకి చాలా ఫెసిలిటీస్ ఉంటాయి. ఎంతటి బహిరంగ ప్రదేశమైనా టెలిఫోన్‌లో మనం మాట్లాడేది బయటకు వినిపించదు. అర్ధగోళాకారంలోని డోమ్‌లు మన మాటల్ని తమలోనే దాచుకుంటాయి. అదీగాక ఇక్కడ పబ్లిక్ ఫోన్ల దగ్గర ఎలాంటి రద్దీ ఉండదు. సొంత ఫోన్లు లేనివాళ్ళు చాలా తక్కువమంది కావడంవల్లనేమో ఈ పబ్లిక్ ఫోన్లను ఉపయోగించేవాళ్ళు నూటికి నలుగురు కంటే చాలా తక్కువేనట!

## నమ్మకాలు

జపాన్‌వారికి కొన్ని నమ్మకాలున్నాయి. 3,5,7 సంవత్సరాల పిల్లలు ఏదో ఒక ప్రమాదానికి గురవుతారని వారి నమ్మకమట. అందుకే ప్రతి సంవత్సరం ఈ వయసున్న పిల్లలు పాల్గొనే మతపరమైన కార్యక్రమం ఒకటి జరుగుతుంది. దాంట్లో ఈ పిల్లలంతా తమకు మంచి జరగాలనీ, ఏ అనారోగ్యం రాకూడదనీ, అదృష్టాన్ని ప్రసాదించమని వేడుకుంటారట. భలే నమ్మకం కదూ!

- రాధ




మేనేజర్ ఏమనుకున్నాడో ''అమ్మకి ఓ చాయ్ ఇయ్యి'' అన్నాడు.

''వద్దు నాయనా!'' అంటూ మళ్ళీ సంచీ అందుకుంది జానకమ్మ.

''చాయ్ తాగి కొంచెం కూసునిపొండి'' అన్నాడతను.

జానకమ్మ టేబుల్ దగ్గర కూర్చుని పైట చెంగుతో మొహం తుడుచుకుంది. ఫాన్ గాలి చల్లగా, హాయిగా తాకింది.

నీరసంతో కళ్ళు మూసుకుని పడుకోవాలనిపించింది. ఇందాక మంచినీళ్ళు ఇచ్చిన కుర్రాడు టీ తెచ్చాడు. టీ తాగి కొంగు ముడి విప్పి రెండ్రూపాయల బిళ్ళ తీయబోయింది.

''వద్దమ్మా! పైసలొద్దు. ఇంత ఎండలో బోతున్నారని చాయ్ తాగమన్నా'' అన్నాడా మేనేజరు.

''ఫర్వాలేదులే నాయనా!'' అంటూ టేబుల్‌పై పెట్టిన రెండ్రూపాయల బిళ్లను తీసుకోకుండా ''వద్దమ్మా'' అన్నాడతను.

జానకమ్మ ''చల్లగా ఉండు నాయనా!'' అని ఆ రెండు రూపాయల బిళ్ళను తీసుకుని మళ్ళీ నడక మొదలుపెట్టింది.

ఓ షాపు దగ్గర బిస్కెట్టు పాకెట్ కొంది. అది సంచీలో పెట్టుకుని రైల్వే క్లబ్బు ఎదురుగా వున్న మూడు నాలుగు రైల్వే క్వార్టర్లలో అడిగింది గోపాలం కోసం.

ఆ పేరుతో అక్కడ ఎవరూ లేరన్నారు. ప్రక్క సందులోంచి వెనక్కి వెళ్లమన్నారు. అంతా రైల్వే క్వార్టర్సే. ఏంచేయాలి? గోపాలం అడ్రస్ మారితే తనకెందుకు రాయలేదు? ఎలా? తిరిగి వెళ్లిపోతే...

ఇంతదాకా వచ్చి వెళ్లిపోవడానికి జానకమ్మ మనస్సు అంగీకరించలేదు.

అంబేద్కర్‌నగర్‌లో అలా అలా అడుగుతూ వెళ్లి రైల్వే హాస్పిటల్ రోడ్డుపైకి చేరుకుంది. చేతులు కంపిస్తున్నాయి. కాళ్ళు వణుకుతున్నాయి. మళ్లీ రోడ్డు పైనుంచి రాజమార్గంలో మెట్టుగూడా వైపునుంచి వెతుకుదాం అని ఆ మొదట్లో ఓ క్వార్టరు తలుపు కొట్టింది.

లోపల్నుంచి ఓ శాల్తీవచ్చి తలుపు తీసాడు. నోట్లోంచి గుప్పున వాసన కొట్టింది. జానకమ్మ కడుపులో తిప్పింది. కొడుకు పేరు, ఉద్యోగం చెప్పి అడ్రస్ అడిగింది.

''ఆ పేరుతో ఎవరూ లేరు ఇక్కడ'' అన్న సమాధానంతో వెనక్కు తిరిగిన జానకమ్మ చెవులకి ''రంజుగా ఆడపిల్లతో సరదా చేయాల్సిన టైంలో ముసల్ది దిగింది. ధూ'' అన్న మాటలు సోకి ఆవిడ మనసు విలవిల్లాడింది. కళ్లల్లో నీళ్ళు తిరిగాయి. చిన్నంత్రం పెద్దంత్రం లేదు ఈ రోజుల్లో అనుకుని మళ్ళీ రోడ్డుపైకి వచ్చింది.

మళ్లీ మొదట్లో అడిగిన రెండు మూడు క్వార్టర్స్‌లో అడిగింది. అదే సమాధానం. కొడుకు అడ్రస్ తెలీకపోవడంతో ఆవిడకి ప్రపంచమంతా తన్ని దగా చేసినట్లు, తానొక్కతే ఎవరికీ అక్కర్లేకుండా బతుకుతున్నట్టు అనిపించింది.

ఇందాక కళ్లల్లో తిరిగిన నీళ్ళు ఇక ఆగలేం అన్నట్లు వడలిపోయిన బుగ్గల మీదుగా జారాయి. ఎండిపోయిన పెదవులకి ఉప్పగా తగిలాయి. ఇంకొంచెం ముందుకుపోదాం అనుకున్న ఆవిడ కళ్లకి మసగ్గా ''అమ్మా!'' అంటూ ఓ రూపం అస్పష్టంగా కనిపించింది. ఆవిడ చేతిలో సంచీ జారిపోయింది. ఎవరో చెయ్యిపట్టి ఆటోలో కూచోబెడుతున్న అనుభూతి. అంతే!

• • •

మళ్ళీ జానకమ్మ కళ్ళు తెరిచేసరికి నులకమంచం మీదున్నది. ఎదురుగా నూతి పళ్లెం దగ్గర సులోచన అంట్లు తోముతోంది.

జానకమ్మ చుట్టూ చూసింది. సులోచనా వాళ్ళ ఇల్లు. దొడ్డివైపు నులకమంచంలో పడుకునుంది. సులోచన అంట్లు తోముతున్నదల్లా తలెత్తి చూసేసరికి కళ్ళు తెరిచిన జానకమ్మ కనిపించింది. చేతులు కడుక్కుని ఆవిడ దగ్గరికి వచ్చిన సులోచన ''మజ్జిగ తాగుతావా మామ్మా!'' అంది.

''తాగుతారా ఏమిటి? ఇవ్వాలిగానీ'' అంటూ పెళ్లాన్ని కసిరాడు గంగాధరం.

జానకమ్మ తల త్రిప్పి మరోప్రక్కకి చూసింది. తన మంచానికి మరో ప్రక్క అరుగుమీద గంగాధరం కూర్చుని ఉన్నాడు.

ఆవిడ మాట్లాడ్డానికి ప్రయత్నించిందిగానీ ఇంకా తల భారంగా, తల తిరుగుతున్నట్లుగా ఉంది. సులోచన చిక్కటి మజ్జిగ తెచ్చింది. తనే జానకమ్మను లేపి కూర్చోబెట్టి మజ్జిగ తాగించింది.

ఓ పదినిముషాలు అలాగే పడుకున్నాక కాస్త జానకమ్మ ప్రాణం తెరిపిపడ్డది. గంగాధరం భార్యతో ఏదో చెప్పి గబగబా బయటకి వెళ్లాడు. ఓ పావుగంట తరువాత పళ్లెంలో ఆపిల్ ముక్కలు, రెండు అరటి పళ్ళు పెట్టుకుని సులోచన వచ్చింది. ''మామ్మా! కాస్త లేచి కూర్చుంటావా?'' అంటూ.

జానకమ్మ అవన్నీ చూసి ''ఎందుకు?'' అని వద్దన్నట్లు తల అడ్డంగా వూపింది.

''మీరు అలా అనడానికి వీల్లేదు. మేం చిన్నవాళ్ళం. ఏదో మా తృప్తికోసం. అయినా మా ఇంటికి మీరొస్తారా ఎప్పుడూ?'' అంటూ గంగాధరం వచ్చి మంచం పక్కన క్రింద కూర్చున్నాడు. సులోచన

అవిడ్ని ఆసరా ఇచ్చి కూర్చోబెట్టింది.

జానకమ్మ పళ్లెంలోంచి రెండు ఆపిల్ ముక్కలు తీసుకుంది. ఇక చాలన్నట్లు తలూపింది. గంగాధరం, సులోచన ఆవిడ్ని అవన్నీ తినేదాకా ఊరుకోలేదు. ఆ తరువాత చల్లటి నీళ్లతో తడిసిన గుడ్డతో ఆవిడ మొహం తుడిచి పడుకోబెట్టింది సులోచన.

జానకమ్మకి ఉదయం నుంచీ జరిగిన సంఘటనలు అన్నీ గుర్తొచ్చాయి. ఆవిడ కళ్లల్లోంచి జారిన కన్నీళ్ళు గంగాధరం దృష్టిని దాటిపోలేదు. మంచం పక్కనే ఉండి ఆవిడ్నే గమనిస్తున్న గంగాధరం–

"మామ్మా! ఏమిటిది? మరోసారి కరెక్ట్ అడ్రస్ కనుక్కుని నేను తీసుకువెళతానుగా. మీరిలా బాధపడొద్దు" అన్నాడు.

జానకమ్మ కళ్ళు మూసుకుంది.

గంగాధరం మనసులో జాలి కళ్లల్లో నీళ్ళ రూపంలో గిర్రున తిరిగింది. పట్టెడన్నం పెట్టని కన్న కొడుకు కోసం ఆ ముసలి తల్లి వేదన, ప్రయాస వృధా అని ఆవిడకెలా చెప్పగలడు? కొడుకు పెళ్లి రోజు అని తనచే స్వీట్లు పంపించిననాడు "ఆ ముసలిదాని నీడ ఈ ఇంట్లో పడానికి వీల్లేదు" అన్న భార్య మాట విని "ఆవిడెందుకయ్యా తీరి కూచోక మా కొంపలో చిచ్చుపెడుతుంది? అసలు నీకూ మాకూ సంబంధంలేదని చెప్పి ఎన్నేళ్ళయింది? అయినా వదలకుండా నెలకూ, రెండునెల్లకీ ఉత్తరాలు రాయిస్తుంది. ఇదిగో ఈ పంపడాలూ... ఎవడేడ్చాడని? అవన్నీ పట్టుకెళ్ళు" అన్న గోపాలం మాటలు అతనికి గుర్తొచ్చాయి.

ఆ రోజు తను తిరిగివస్తూ ఆ స్వీట్లు చర్చి ముందున్న బిచ్చగాళ్లకి పంచాడు. తల్లి కాళ్ళకు ఫ్రాక్చర్ అయిందని చెప్పేందుకు వెళితే "ఎక్కడో అప్పడాలు అమ్ముకుంటూ తిరుగుతూంటే ఏ స్కూటరో కొట్టి వుంటుంది. ఇహ ఇప్పుడావిడ్ని తీసుకొచ్చి ఇంటిని లేబర్ కొంప చేయాలా?" అన్న కొడుకూ కోడళ్ళని గూర్చి ఆవిడకేం చెప్పగలడు?

జానకమ్మకి సులోచనే చెప్పింది "పిల్లాడికి తలనీలాలు ఇచ్చేందుకు తిరుపతి వెళ్లారుట" అని ఆవిడ బాధ పడకుండా. ఇప్పుడు తల్లికి దూరంగా ఉండాలన్న ఉద్దేశ్యంతో విజయవాడ ట్రాన్స్‌ఫర్ చేయించుకుని రాంగ్ అడ్రస్ ఇంటావిడకి చెప్పారని తెలిస్తే ఆవిడ గుండె బ్రద్దలవదూ?

జానకమ్మకి కొడుకు గుర్తొచ్చాడు. ఆరేళ్ళ గోపాలం ప్రక్కింటి పిల్లల్తో పోటీగా కొత్త బట్టలు కావాలంటే ఓ పెళ్లికి వంటకెళ్లింది. ఆ డబ్బులతో కొత్త బట్టలు కొంది కొడుక్కి. పన్నెండేళ్ళ గోపాలం స్కూలు పిల్లల్తో నాగార్జునసాగర్ వెళతానంటే యాభైరూపాయలు లేక నీళ్ళు కాచుకునే రాగి తప్పేలా అమ్మిన రోజు గుర్తొచ్చింది.

గోపాలాన్ని కాలేజీలో చేర్చేందుకు ఆదాయం పెంచుకోవాలి, అందుకని ఇంటావిడ మేనత్త మంచంలో వుంటే ఆరునెలలూ ఆవిడ పోయేంతవరకూ ఈ చేయీ, ఆ చేయీ అనక మలమూత్రాల దగ్గర్నుంచీ ఎత్తిపోసి నెలకి నాలుగువందలు అదనంగా ఆర్జించిన రోజులు గుర్తొచ్చాయి.

ఫస్టన పాసయిన గోపాలం ఉద్యోగంలో చేరే రోజు వాడికి మంచి బట్టలు కావాలని మొగుడి జ్ఞాపకంగా మిగిలిన ఆయన వెండి పళ్లెం అమ్మి డబ్బు ఇచ్చిన రోజు గుర్తొచ్చింది. అవాళ అన్నీ అమ్మకి చెప్పే గోపాలం ఇవాళ అమ్మకి చెప్పకుండా ఎలా ఉండగల్గాడు? తను అప్పటి అమ్మేగా? మూసిన ఆవిడ కనురెప్పల క్రిందిగా కనుకొనుకుల్లోంచి అపక్కలని కన్నీరు జారింది.

పెదవులు వణికాయి. ఓ పది నిముషాల అంతఃఘర్షణ తరువాత ఆవిడ పెదవులపై వెలిసిపోయిన చిరునవ్వు వెలిసింది.

ఆ రోజుల్లో వాడికి డబ్బు సంపాదించడం తెలీదు. వాడి అవసరాలు తను తీర్చింది. ఈ రోజు వాడి సంపాదన ముందు తనెంత? వాడి అవసరాలు తనేం తీర్చగలదు? పసి వయసులో తెలియని అజ్ఞానం... ఈ వయసులో తెలుసుకోలేని అజ్ఞానమా? ఏదో...ఛ...!

ఏదో చప్పుడు ఆవిడ ఆలోచనలకి భంగం కలిగించింది. పూర్ణ సంచీ లాగినట్టున్నాడు. అరుగుపైనున్న సంచీలోంచి బిస్కెట్టు పాకెట్ కిందపడింది.

"ఒరే వెధవా తప్పురా" అంటూ సులోచన వాడ్ని దూరంగా లాగి మళ్లీ అన్నీ సర్ది సరిగ్గా పెట్టింది. జానకమ్మ, గంగాధరంవైపు, సులోచనవైపు చూసింది.

"సులోచనా! సంచీ ఇలా తేమ్మా!" అంది.

సులోచన సంచీ తీసుకువచ్చింది. జానకమ్మ మనసు బలం పుంజుకుంది. లేచి కూర్చుని సంచీలోని డబ్బాలుతీసి సులోచనకి అందించింది.

"అదేంటమ్మా! వద్దు ఉంచండి" అన్నాడు గంగాధరం.


"నువ్వూరుకో... పళ్లెంలో పెట్టుకురామ్మా. తలా కాస్తా తిందాం" అంది. కొత్త డ్రెస్సు చేతిలో పట్టుకుని "పూర్ణని ఇలా తీసుకురా గంగా!" అంది.


క్షణకాలం ఆవిడ మొహం చూసి పూర్ణని ఆవిడ దగ్గరికి తెచ్చాడు గంగాధరం.

పళ్లెం పట్టుకువస్తున్న సులోచన గంగాధరాన్ని చూసి నవ్వింది. లాగూలో కాళ్ళు దూర్చడం రాని పూర్ణని దగ్గరకు లాక్కుని డ్రస్సు తొడుగుతూ "వీడికి నా అవసరముంది సుమా!" అనుకుంది జానకమ్మ!

★

## వార్నాయనోయ్!





పొడుగుకాళ్ళ సుందరి శిల్పాశెట్టి తనకు నచ్చే మగాడు ఎలా వుండాలో సెలవిస్తోందిట.

★ హేండ్సమ్‌గా వుండాలి

★ సిగరెట్ తాగకూడదు

★ ఆడవాళ్ళవైపు అదేపనిగా చూడకూడదు (పోనీ అప్పుడప్పుడు చూడొచ్చా?)

★ క్లీన్‌షేవ్‌గా వుండాలి

★ షూటింగ్ నుంచి ఇంటికి రాగానే 'అలసిపోయావా డియర్..' అని అడగాలి. (ఇంకా నయం అమృతాంజనం రాయాలన్లేదు)

- ప్రియ

